క్లుప్తంగా

ఫ్లెక్సీలతో రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో తులసీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు జేఏసీ నాయకులు

ఉప్పలగుప్తం: ఇటీవల సినిమా హీరోల పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై గొడవలు జరుగుతున్నాయని, ఫ్లెక్సీలతో రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల మాల మహానాడు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.తులసీకృష్ణకు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, నాయకులు గెద్దం సురేష్‌బాబు, కుంచే బాబులు, దేవరపల్లి రాంబాబు, దోనిపాటి రాంబాబు, గుంట్రు చిట్టిబాబు, పరమట మురళీ పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

తాళ్లరేవు: గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండలంలోని పలు చోట్ల శుక్రవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా తాళ్లరేవు మాధవరాయునిపేటలో వరసిద్ధి వినాయక మహోత్సవాల సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలోని గొల్లలవీధి, మరిడమ్మ కాలనీలో అన్నసమారాధన నిర్వహించారు. జి.వేమవరం రామాలయం వీధిలోని నరసయ్య తోటలోని శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద ఎనిమిదో గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, పుణ్యమంతుల సత్తిబాబు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం పంచాయతీ పరిధి సుంకర వీధిలో స్వామివారికి సమర్పించిన లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించగా.. స్థానికుడు రంబాల ఈశ్వరరావు రూ.16,600కు దక్కించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది.

ఎల్ఐసీ ఉద్యోగుల హెల్త్ వాక్



అమలాపురంలో ఎల్ఐసీ ఘనతను వివరిస్తున్న ఆ సంస్థ ఉద్యోగులు

అమలాపురం టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ 69వ బీమా వారోత్సవాలు అమలాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద బ్రాంచి మేనేజర్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐసీ ఉద్యోగులు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు పట్టణంలో హెల్త్ వాక్ చేపట్టారు. స్థానిక ఎస్ఐసీ బ్రాంచి కార్యాలయం నుంచి కిలోమీటరు మేర నడక నిర్వహించి గడియారం స్తంభం సెంటరుకు చేరుకున్నారు. ఆ సెంటరులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఎస్ఐసీ నూతన పథకాలను ప్రజలకు వివరించారు. అంబాజీపేట శాటిలైట్ ఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ కుమార్, ఏబీఎం మధుబాబు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు టి.రమేష్‌బాబు, ఎన్.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఎస్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాలాశ్రీ

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షలో యానాంకు చెందిన జువ్వల బాలశ్రీ ఎంపికయ్యారు. శుక్రవారం పుదుచ్చేరి ఎగ్జామినేషన్ అథారిటీ రాత పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. నాలుగు రీజియన్ల నుంచి వేలాది మంది అభ్యర్థులు రాత పరీక్ష రాశారు. అయితే యానాం నుంచి ఎస్సీ విభాగంలో 133.75 అత్యధిక మార్కులతో జువ్వల బాలశ్రీ ఎంపిక కావడం విశేషం. ఆమె యానాంలో ప్రాథమిక, ఉన్నత విద్యనభ్యసించి అనంతరం ఖరగ్‌పూర్ ఐఐటీకి ఎంపికై ఐఐటీ పూర్తి చేశారని తల్లిదండ్రులు బాల వెంకటసుబ్బారావు, సీతారత్నం తెలిపారు. అదే విధంగా జనరల్ విభాగం నుంచి 144.75 మార్కులతో ముత్యాల శ్రీరమ్య వెయిటింగ్ జాబితాలో ఉన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

తాళ్లరేవు: కేవీఆర్ అంజలి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం ఇంజరంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకరపర్తి వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శివాలయం వెనుక ఉన్న ఎంపీపీ స్కూల్ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరానికి కాకినాడ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సాగుకు బహుదూరం

- ఖాళీగా దర్శనమిస్తున్న సువిశాల వ్యవసాయ భూములు
- ఐదేళ్లుగా ఖరీఫ్‌లో నాట్లు వేయని వైనం
- ఆక్వా సాగు, వరద ముంపు ప్రతిబంధకాలు



రెల్లుగడ్డలో ఐదేళ్లుగా ఖరీఫ్ సాగు చేయని సువిశాల వ్యవసాయ క్షేత్రం



మొగళ్లమూరులో ఆక్వా చెరువుల నుంచి ఉప్పునీరు పోటెత్తడంతో నాట్లు వేయని పొలాలు

అల్లవరం: సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని కృషి ఫలితంగా ధవళేశ్వరం వద్ద వరద నీటికి అడ్డకట్ట వేసి గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల భూమిని సాగులోకి తెచ్చి ఆంధ్ర రాష్ట్రానికే అన్నపూర్ణగా పేరొందిన సువిశాల పంట పొలాలు నేడు బీడు వారి రైతులకు కన్నీరు మిగుల్చుతోంది. ఆ మహానుభావుడు కృషి ఫలితంగా మూడు పంటలతో సస్యశ్యామలమైన వ్యవసాయ క్షేత్రాలు ఆక్వా పుణ్యమా నేడు బీడు వారుతున్నాయి. మూడు దశాబ్దాలు క్రితం తీరం వెంబడి, ప్రధాన మురుగు కాలువల పొడవునా క్రమేణా విస్తరించిన ఆక్వా సాగు వ్యవసాయ క్షేత్రాల్లోకి చొచ్చుకొచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగు విస్తరించి వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆక్వా సాగు బాగా పుంజుకోవడంతో సువిశాల వ్యవసాయ క్షేత్రాలు రొయ్యల చెరువులుగా మారుతూ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి.

పంట పొలాల్లోకి పోటెత్తుతున్న ఉప్పునీరు

అల్లవరం మండలంలో రెల్లుగడ్డ, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, దేవగుప్తం, మొగళ్లమూరు గ్రామాల్లో సువిశాల వ్యవసాయ క్షేత్రాలు కిలోమీటర్ల పొడవునా ఉన్నాయి. ప్రధాన మురుగు కాలువ వెంట రొయ్యల సాగు బాగా విస్తరించడంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎగువ ప్రాంతాల్లోని పొలాల నుంచి ముంపు నీరు దిగేందుకు మార్గాలు మూసుకుపోవడంతో ఉప్పునీరు, కలుషిత జలాలు పోటెత్తి వ్యవసాయ క్షేత్రాలు వరి సాగుకు పనికి రాకుండా పోతున్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో ముంపు నీరు భారీగా స్తంభించడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముంపు నీరు దిగే దారులు లేక సాగుకు తీవ్ర ప్రతిబంధకంగా మారింది.

దాళ్వా సాగుకు మాత్రమే పరిమితం

ఐదేళ్ల కిత్రం వరకు రెండు పంటలు పండిన పొలాలు కొన్ని గ్రామాల్లో నేడు దాళ్వా సాగుకు మాత్రమే పరిమితమయ్యాయి. రెల్లుగడ్డలో సుమారు 300పైగా ఎకరాలు, దేవగుప్తంలో 100 పైగా ఎకరాలు, కొమరగిరిపట్నంలో 150 పైగా ఎకరాలు, మొగళ్లమూరులో 70 ఎకరాలు, బెండమూర్లంకలో సువిశాల వరి క్షేత్రంలో ఖరీఫ్ పంట సాగు చేయడం లేదు. 2011లో పంట విరామం అమలైన నాటి నుంచి ఏటా ఖరీఫ్ సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అధిక వర్షాలు కురిసి పంటలు నష్టపోవడం ఒక కారణమైతే, ముంపు నీరు స్తంభించడం రెండో కారణంగా కనిపిస్తోంది. ఈ రెండు ప్రధాన సమస్యలతో ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో సాగుకు అవరోధం ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి పూర్వ వైభవం రావాలంటే మురుగునీరు దిగువకు నిత్యం పారేలా డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. వ్యవసాయ క్షేత్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగుచేస్తున్న ఆక్వా చెరువులను నియంత్రిస్తే వ్యవసాయానికి మంచి రోజులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పలువురి అభినందనలు



సూర్యనారాయణరాజు దంపతులను అభినందిస్తున్న నాయకులు

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారికి పలువురు అభినందనలు తెలిపారు. తాళ్లరేవు నుంచి ఆర్‌టీఐ విభాగం అధ్యక్షునిగా నియమితులైన పొన్నాడ భైరవమూర్తి, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మానుపాటి సూర్యనారాయణను పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లి మణికంఠ తదితరులు శుక్రవారం కలిసి పూలమాలతో సత్కరించి అభినందించారు. అదేవిధంగా జార్జీపేట ఎంఎల్‌కె నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటిలెక్చువల్ (మేధావుల) విభాగం అధ్యక్షునిగా నియమితులైన పెట్ల సూర్యనారాయణ రాజు, ఆయన సతీమణి శాంతకు మారిసు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి, నాయకులు తదితరులు సత్కరించారు.

శాస్త్రోక్తంగా ఆయుధ పూజ

170వ వార్షికోత్సవం లోగో ఆవిష్కరణ



మహిపాల వీధి దసరా ఉత్సవాలు 170వ వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న పెద్దలు

అమలాపురం టౌన్: అమలాపురం దసరా ఉత్సవాలకు సంబంధించి ఏడు వీధుల్లో ఒకటైన మహిపాలవీధి చెడీ తాలింఖానా ఆద్యుడు అబ్బిరెడ్డి రామదాసు విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి భేతాళ పూత (ఆయుధ పూజ) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆయుధ పూజ ద్వారా మహిపాల వీధి 170వ వార్షికోత్సవ దసరా ఉత్సవాలకు నాంది పలికారు. చెడీ తాలింఖానా మూడు తరాలు గురువుల విగ్రహాలైన అబ్బిరెడ్డి రామదాసు (1వ తరం), అబ్బిరెడ్డి నరసింహరావు (2వ తరం), అబ్బిరెడ్డి రామదాసు (3వ తరం) వద్ద మహిపాల వీధి ప్రజలు పూజలు చేశారు. 170 సంవత్సరాల లోగోను ఆవిష్కరించారు. వచ్చే అక్టోబర్ 2న అమలాపురంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అబ్బిరెడ్డి కుటుంబీకులు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, మహిపాల వీధి పెద్దలు తిక్కిరెడ్డి నేతాజీ, అబ్బిరెడ్డి సురేష్, దూడల ఫణి, బండారు రామమోహనరావు, ఆకుల ఈశ్వరరావు, దార్లంక నాయుడు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు శ్రీకారం

యానాం: పట్టణంలో కొలువైన శ్రీలలితాదేవి అమ్మవారి 51వ నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం రాట ముహుర్తం నిర్వహించారు. ఈనెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అర్చకులు మానేపల్లి గణేష్ తెలిపారు. కార్యక్రమంలో మట్టా సత్యవెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గణేశునికి గరిక పూజ



గొల్లవిల్లిలో గణేశుని లడ్డూను భక్తునికి అందిస్తున్న కమిటీ సభ్యులు



భక్తులకు ప్రసాదాలను వడ్డిస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అమలాపురం రూరల్: వినాయక చవితి నవరాత్ర మహోత్సవంలో భాగంగా అమలాపురం మండలం ఇందుపల్లి బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష గరిక పూజ నిర్వహించారు. రాణి కామేష్ బ్రహ్మతత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

రూ.60వేలు పలికిన లడ్డూ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలోని సిద్ధివినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహించిన నవరాత్ర ఉత్సవాల్లో వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా రూ.60వేలు పలికింది. గ్రామానికి చెందిన మాజీ ఉత్సవ కమిటీ సభ్యుడు సలాది పల్లంరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు సలాది రాంబాబు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. వానపల్లిపాలెంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన నల్లా వెంకటేశ్వరరావు, నల్లా సుబ్బారావు రూ.40 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

మాజీ ఎంపీ అనురాధ ప్రత్యేక పూజలు

అల్లవరం: మొగళ్లమూర్ సెంటర్లోని లక్ష్మీగణపతి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమకు మాజీ ఎంపీ చింతా అనురాధ శుక్రవారం అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దివంగత చింతా కృష్ణమూర్తి, విజయభారతి జ్ఞాపకార్థం వారి కుమార్తె మాజీ ఎంపీ చింతా అనురాధ ఆర్థిక సహకారంతో భారీ అన్నసమారాధన ఆలయం వద్ద నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను మాజీ ఎంపీ స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు జున్నూరి రామారావు (బాబీ), ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, మాజీ సర్పంచ్ కాండ్రేగులు పెద సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల జవహర్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

దళితులపై దాడిని ఖండిస్తున్న నాయకులు

ఐ.పోలవరం: గ్రామంలోని పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో శుక్రవారం ఐ.పోలవరం మండల మాల మహానాడు ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం మండల కన్వీనర్ రేవు శ్రీను అధ్యకతన జరిగింది. ఇటీవల పిఠాపురం, బి.కొత్తూరులో వినాయక నిమజ్జనానికి వెళుతున్న దళితులపై దౌర్జన్యంగా దాడి చేసి గాయపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకి బదులు కల్యాణ్ సీమ అని ఫ్లెక్సీలపై ముద్రించే వారిపై చర్యలు తీసుకోవాలని ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలన్నారు. వడ్డీ గౌతమ్, మట్ట గగనవీరుడు తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ కోసం అధికారులతో సమావేశం



అధికారులతో సమావేశమైన అంకిత్‌కుమార్

యానాం: సునామీ మాక్‌డ్రిల్– 2025కు సంబంధించి నిర్వహణ కోసం శుక్రవారం ఆర్ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులతో పాటు వివిధ గ్రామాలను కలుపుకొని నిర్వహించే మాక్‌డ్రిల్‌కు సంబంధించి ఏర్పాట్ల గురించి చర్చించారు. అదే విధంగా ఈఎస్ఎఫ్ బృందం పాత్ర, బాధ్యతలు గురించి, సునామి ప్రభావిత ప్రాంతాల కల్పన, మాక్‌ఎక్స్‌ర్‌సైజ్ ప్రాంతాలు, రిలీఫ్ క్యాంప్స్, మాక్‌డ్రిల్ హెచ్చరికలు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు తదితరమైన వాటితోపాటు అధికారుల కో–ఆర్డినేషన్ గురించి సైతం చర్చించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు, జీజీహెచ్ డీడీ రవి శంకర్, ఎస్పీ వరదరాజన్, సీఐ అడలరసన్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే అశోక్ పరామర్శ

యానాం: నియోజకవర్గ పరిధిలో గాయపడి అదేవిధంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కాకినాడలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మట్టా ప్రసాద్‌ను పరామర్శించి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అదేవిధంగా ఇటీవలి వీధి కుక్కలు అడ్డు రావడంతో గాయపడి ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న ఓల్డ్ రాజీవ్‌నగర్‌కు చెందిన లంక ప్రసాద్‌ను వారి కుటుంబాన్ని పరామర్శించారు.

వార్షికోత్సవ సభకు రావాలి

తాళ్లరేవు: హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 7న జరిగే విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవ సభకు తరలిరావాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీ, తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు భారీ సభ జరుగుతుందన్నారు. దేశంలో ఉన్న దళితుల స్థితిగతులపై చర్చ జరుగుతుందని, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దళిత మేధావులు, సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

అమలాపురం టౌన్: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు అమలాపురంలో ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మొల్లా మసీదులో ప్రవక్త జన్మదిన వేడుకలు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీధుల్లో జషనే ఈద్ ఎ మిలాన్ ఉన్ నబీ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ముస్లిం పెద్దలు ఎండీ అమీర్, ఎడీ ఆజామ్, ఎండీ బషీర్, ఎడీ నిజాముద్దీన్, ఎండీ ఖాదర్ వలీ పాల్గొన్నారు.

యానాం: మిలాద్– ఉన్– నబీ వేడుకలను యానాంలో శుక్రవారం ముస్లింలు ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి అనంతరం పరస్పరం మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు. ఉపాధ్యాయులు



చొల్లంగి రామ్‌ప్రసాదు



గుబ్బల నాగేశ్వరరావు

అల్లవరం: మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఈఓలు కిరణ్‌బాబు, ఎస్ ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. దేవగుప్తం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వేణుగోపాలస్వామి, గుండెపూడి పల్లిపాలెంలోని పీఎస్ హెచ్‌ఎం చొల్లంగి రామ్‌ప్రసాదు, బోడసకుర్రు ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడు గుబ్బల నాగేశ్వరరావు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు కలెక్టర్ మహేష్‌కుమార్ చేతులమీదుగా శుక్రవారం అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారని తెలిపారు.

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా సత్యనారాయణ మూర్తి

అమలాపురం రూరల్: జిల్లాస్థాయి ఉత్తమ అవార్డును ఎ. వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొంతు వీర వెంకట సత్యనారాయణ మూర్తి శుక్రవారం అమలాపురంలో కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. డీఈవో షేక్ సలీం బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు మోకా ప్రకాష్ ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు అవార్డు గ్రహీత సత్యనారాయణ మూర్తిని అభినందించారు.

విష్ణుప్రసాద్‌కు ఉత్తమ పీఈటీ అవార్డు

విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పరమట విష్ణు ప్రసాద్‌కు కోనసీమ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు లభించింది.అమలాపురంలో శుక్రవారం ఆయన కలెక్టర్ మహేష్ కుమార్, డీఈవో షేక్ సలీం బాషా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఉప్పలగుప్తం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.తులసీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంఈవో–1గా బాధ్యతలు తీసుకున్న నూకల వీరశంకర్రావును, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆకవు ఉష, వై.శ్రీనివాస్, సబ్బతి ఝాన్సీరాణి, అడబాల శ్రీదేవి, దంగేటి నాగశ్రీనివాస్, పీవీ గోపాలంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, సర్పంచ్‌లు కడమి చిన్నవరాజు, జిన్నూరి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, ఇసుకపట్ల జయమణి, ఎంపీటీసీ సభ్యులు వంగా గిరిజాకుమారి, దేశంశెట్టి నాగరత్న కుమారి, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ అవార్డు అందుకున్న ప్రభాకర్

యానాం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యామంత్రి రీజినల్ అవార్డును శుక్రవారం యానాం రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు పుదుచ్చేరి విద్యాశాఖా మంత్రి నమశ్శివాయం చేతుల మీదుగా అందుకున్నారు. పుదుచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ప్రభాకరరావుకు నగదు బహుమతితోపాటు, ప్రసంశాపత్రం అందించి ఘనంగా సత్కరించారు. సుమారు 30 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా వివిధ పాఠశాలల్లో విద్యాసేవలు అందించడంతో పాటు సర్వశిక్షా అభియాన్ ఏడీపీసీగా సైతం సేవలు అందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

అమలాపురం రూరల్: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సూదా గణపతి అధ్యక్షతన అమలాపురం లయన్స్ క్లబ్ హాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జోనల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్ చేతుల మీదుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోన్ చైర్‌పర్సన్ కేవీ సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేశారు. పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బెహరా హనుమంతరావు, పూర్వపు జిల్లా గవర్నర్ పీఎస్ శర్మ, రీజియన్ చైర్మన్ బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన గురుపూజోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు, సంగీత విద్వాంసులు, కళాకారుడు ఆకొండి శ్రీనివాసరాజారావు హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జి.వేమవరానికి అవార్డు

ఐ.పోలవరం: మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు స్పోర్ట్స్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు 2024–2025 సంవత్సరానికి జి.వేమవరం ఉన్నత పాఠశాలకు లభించింది. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 300 పాఠశాలలు పాల్గొనగా 248 పాయింట్స్‌తో జి.వేమవరం ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ అవార్డుని గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్ కుమార్, డీఈవో సలీం భాషా చేతుల మీదగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారణాసి సుభద్ర లక్ష్మీదేవి, పాఠశాల పీడీ కళావతి, పీడీ రాంప్రసాద్ ఈ అవార్డుని అందుకున్నారు. అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయులు, పీడీలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బసవ అప్పారావు, సర్పంచ్ నల్లా సుదర్శన్ రావు, లంకలపల్లి దుర్గాదేవి, జి.వేమవరం సొసైటీ అధ్యక్షుడు పెంట రవి, ఎంపీటీసీలు లంకలపల్లి దుర్గారాణి,, జ్యోతి నాయుడు, మద్దింశెట్టి పురుషోత్తం తదితరులు అభినందనలు తెలిపారు.



లయన్స్ క్లబ్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గణపతి తదితరులు



తాళ్లరేవులో గురువులను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి

తాళ్లరేవు: సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకోవాలని తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు కోరారు. శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కన్నీడి నాగవేణి, భూపతి సుమశ్రీ, కస్సేపల్లి నాగేంద్రశర్మ, ఫయాద్ సయ్యద్, మందపల్లి సూర్యప్రకాష్, వేగేశ్న వెంకటేశ్వరరాజు, ఎస్వీ రమణకుమార్‌ను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జీఈటీ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి, లయన్స్ ప్రతినిధులు వేలూరి సూరిబాబు, నామన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.







కలెక్టర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న వేణుగోపాలస్వామి, విష్ణుప్రసాద్, సత్యనారాయణమూర్తి



కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న హెచ్‌ఎం సుభద్ర, పీడీ కళావతి, రాంప్రసాద్



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రభాకరరావు